ప్రజాశక్తి
సోమవారం 11 సెప్టెంబర్ 2023 5 అనంతపురం





సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయులను బోధనకే వినియోగించాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయులను బోధనే ఉపయోగించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలోనిఉపాధ్యాయ భవనంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం అనంతపురం, శ్రీ సత్య సాయి, నంద్యాల ,కర్నూలు, అన్నమయ్య, కడప జిల్లాల ప్రధాన నాయకత్వ సమావేశం జరిగినది. ఈ సమావేశానికి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరితోపాటు రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ ఎం వి సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ దేవేంద్రమ్మ, ఎన్ శాంతి ప్రియ పాల్గొన్నారు. ఈసందర్భంగా నక్కావెంకటేశ్వర్లు మాట్లాడుతూ బోధన కోసం నియామకం చేసిన ఉపాధ్యాయుల చేత ఎక్కువ సమయం బోధనేతర కార్యక్రమాలు వినియోగించుకుంటూ విద్యార్థులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. సెల్ ఫోన్లను పాఠశాల బోధనా సమయంలో వాడటం నిషేధం చేశారని, అయితే అదే బోధనా సమయంలో ఎదో ఒక సమాచారం పంపమని చెప్పడంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు. పాఠశాల పనిదినాలలో ఏదో ఒక పేరుతో శిక్షణా కార్యక్రమాలు పెట్టడం ద్వారా విద్యార్థుల బోధనా సమయాన్ని హరిస్తున్నట్లు కాదా అని ప్రశ్నించారు. ఎక్కడ ఉపాధ్యాయుల తప్పులు దొరుకుతాయి అనే పద్ధతిలో అధికారులు పర్యవేక్షణ ఉండటం సరికాదని అన్నారు. అసలు పర్యవేక్షణ అంటే ఉపాధ్యాయులను శిక్షించడం అనేవిధంగా అర్థం మార్చివేశారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఉపాధ్యాయుల పూర్తి సమయాన్ని విద్యార్థుల భోదనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయకుండా ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. ప్రాథమిక పాఠశాలల నిర్వీర్యం చేయడం అపి,బలోపేతానికి కావాల్సిన చర్యలు ,సూచనలు విద్యారంగ శ్రేయోభిలాషులనుండి ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. వివిధ పోరాటాల సందర్భంగా ఉపాధ్యాయులపై బనాయించిన కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగమయ్య, గోవిందరాజులు, శ్రీ సత్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ జయచంద్రారెడ్డి, ఎం సుధాకర్, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె. సుధాకర్, పివి. ప్రసాద్, కర్నూలు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె ఎల్లప్ప, ఎం జయరాజ్ అన్నమయ్య జిల్లా నుండి బి హరి ప్రసాద్ ,కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి మహేష్, ఎం విజయ్ కుమార్‌తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హై అలర్ట్

చంద్రబాబు రిమాండ్‌తో టిడిపి శ్రేణుల్లో నిర్వేదం

ప్రధాన కూడళ్లలో పోలీసు పహారా

నేడు బంద్‌కు పిలుపు



కదిరిలో టైర్లు కాల్చి నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు



రాయదుర్గంలో నిరసన దీక్ష చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును 14 రోజులు పాటు రిమాండ్‌కు న్యాయ స్థానం ఆదేశించడంతో టిడిపి శ్రేణుల్లో నిర్వేదం నెలకొంది. శనివారం ఆయన్ను అరెస్టు చేసి ఆదివారం ఉదయం కోర్టు ముందు హాజరుపరచినప్పటి నుంచే ఆ పార్టీ శ్రేణుల్లోనే కాకుండా సామాన్యుల్లోనూ ఉత్కంఠత నెలకొంది. జిల్లాలో ఎక్కడ ఇద్దరు కలిసినా చంద్రబాబు అరెస్టు విషయంపైనే చర్చ జరగడం గమనార్హం. ఉదయం నుంచి తీర్పు కోసం అందరూ ఆసక్తిగానూ, ఉత్కంఠతతోనూ ఎదురు చూశారు. సాయంత్రం ఆయనకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ తీర్పునివ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగానే హై అలర్టును ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలోనూ హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ప్రధాన పట్టణాలు, నగరాల్లో పోలీసులను అప్రమత్తం చేశారు. అన్ని ప్రధాన కూడళ్లలో పోలీసు పహారాను ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ విధించారు. సాయంత్రం తీర్పు వెలువడినప్పటి నుంచి జనాలు గుమికూడకుండా పోలీసులు చర్యలు చేపడుతున్నారు.

కొనసాగిన నిరసనలు

చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ ఆదివారం నాడు అనంతపురం జిల్లాలో పలుచోట్ల నిరసనలు కొనసాగాయి. పలుచోట్ల మౌనదీక్షలను చేపట్టారు.సత్యసాయి జిల్లాలో రెండు చోట్ల టిడిపి అభిమానులు చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ సెల్ టవర్లు ఎక్కారు. లేపాక్షి, కదిరిల్లో సెల్‌టవర్ ఎక్కి నిరసన చేపట్టారు పోలీసులు నచ్చజెప్పి వారిని కిందకు దింపారు. అనంతపురం , రాయదుర్గం, కళ్యాణదుర్గం, కదిరి తదితర ప్రాంతాల్లో నిరసన దీక్ష చేపట్టారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాల వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే ఇబ్బంది పెట్టేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.

నేడు బంద్‌కు పిలుపు

చంద్రబాబునాయుడు రిమాండ్‌కు తరలించిన నేపథ్యంలో ఆ పార్టీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. జిల్లాలోనూ నేడు బంద్ కొనసాగే అవకాశముంది.. సోమవారం నిరసనలు మరింత పెరిగే అవకాశాలున్నందున పోలీసులు అప్రమత్తమయ్యారు. ముఖ్యమైన నాయకుల ఇళ్ల వద్ద సైతం పోలీసు నిఘాను పెట్టారు. తెలుగుదేశం పార్టీకి జిల్లాలో మంచి పట్టుంది. దీంతో నిరసనలు పెద్ద స్థాయిలోనే జరిగే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. ఎక్కడా ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

చట్టం ఎవరి చుట్టం కాదు..

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-శింగనమల

చట్టం ఎవరి చుట్టం కాదని, తప్పు ఎవరు చేసినా చర్యలు తప్పవని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. ఆదివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో టిడిపి అధినే చంద్రబాబు రూ.371 కోట్లు అడ్డంగా దోచుకుని పూర్తి ఆధారాల తో దొరికిపోయారని ఆరోపించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని సద్వినియోగం విధంగా ఉండాలి కానీ చంద్రబాబులా దుర్వినియోగ ం చేయకూడదన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఎన్నివిధాలుగా డబ్బు కూడపెట్టాలో ఆలోచించారన్నారు. 2018లో పూణేలో కొన్ని కంపెనీల అక్రమ ఇన్ వాయిస్‌లతో ఈస్కాం బయటపడిందన్నారు. 2021లో ఎపిఎస్ ఎస్‌డిసి ఛైర్మన్‌గా అజయ్‌రెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేయడంతో వాటి ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. రెండేళ్లుగా సిఐడి లోతుగా దర్యాప్తు చేసిన తర్వాతనే చంద్రబాబు పాత్రపై స్పష్టమైన ఆధారాలు లభ్యం కావడంతో అరెస్టు చేశారని వివరించారు. స్కిల్స్ స్కామ్ లో రూ.371 కోట్లు వివిధ షెల్ కంపెనీలకు వెళ్లి తిరిగి చంద్రబాబు ఖాతాకు చేరినట్టు సిఐడీ గుర్తించిందని తెలిపారు. చంద్రబాబు ఉన్నది లేనట్టు.. ప్రజలకు భ్రమలు కల్పిస్తున్నారన్నారు. ఆయన 40ఏళ్ల అనుభవం, నాలెడ్జ్ ఉందని చెప్పుకుంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో వేల అక్రమ సంపాదన పోగు చేసుకున్నారన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ నీలం భాస్కర్, ఎంపిపి సునీత, సర్పంచు పార్వతి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

వైసిపి కదిరి సీటుపై మైనార్టీల చూపు

పెరుగుతున్న ఆశావహులు

గట్టినమ్మకంతో సీనియర్ నాయకుడు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ కదిరి ఎమ్మెల్యే టికెట్‌పై వైసిపిలోని మైనార్టీల్లో పోటీ నెలకొంటోంది. ఈసారి మైనార్టీలకు టికెట్ కేటాయిస్తే తమకు అవకాశం ఇవ్వాలని ఆశావహులు తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్నారు. వైసిపి ఆవిర్భావం కంటే ముందు నుంచే జగన్మోహన్‌రెడ్డి వెంట నడిచిన వైసిపి మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్ ఎమ్మెల్యే టికెట్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హాయంలో పనిచేసిన ఆయన వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం ప్రయత్నాలు చేశారన్న అభిప్రాయాలు నియోజకవర్గంలో వినిపిస్తున్నాయి. అయితే2014, 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి ఇస్మాయిల్ అని చివరి వరకు ప్రచారం జరిగింది, అయితే చివరి నిమిషంలో ఆయనకు బిఫారం దక్కలేదు. దీంతో ఆయన ఆసమయంలో తీవ్ర నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం కదిరి నియోజకవర్గంలో మైనార్టీ నాయకుల్లో పార్టీ ప్రతిష్ట కోసం పనిచేసిన ప్రధాన వ్యక్తి ఇస్మాయిల్ అన్న అభిప్రాయాలు ఆపార్టీ వర్గాల్లోనే వెలువడుతున్నాయి. పార్టీ అధికారంలో ఉన్నా ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ ప్రతిష్ట కోసమే పని చేస్తూ కార్యకర్తలను కలుపుకుంటూ ముందుకు పోతున్న ఇస్మాయిల్‌కు జగన్ ఈసారైనా న్యాయం చేకూర్చుతారా అన్న చర్చలు జోరందుకున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొత్త కొత్త వ్యక్తులు పార్టీ పేర్లు చెప్పుకొని ఆర్థిక బలం ఉన్న వారమంటూ పార్టీ బడాబాబుల వద్దకు తిరుగుతున్న నాయకులు తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వైసిపిలో కదిరి స్థానం మైనార్టీకు కేటాయిస్తే ఎవరిని టికెట్ వరిస్తుందోనన్న చర్చలు నియోజకవర్గంలో ఊపందుకున్నాయి.



హిందూపురంలో వైసిపి టికెట్ మైనార్టీలకు కాకుండా ఇతరుకు కేటాయిస్తున్నారన్న సంకేతాలు వస్తున్న నేపథ్యంలో కదిరి టికెట్‌పై మైనార్టీ ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ మధ్యకాలంలో ఆర్థికంగా బలంగా ఉన్న నాయకులు తెరపైకి రావడంతో గతంలో నుంచి పని చేసిన నాయకులు కనుమరుగవుతారా అన్న అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఇస్మాయిల్ ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కలిసినప్పుడు ఆయనకు మాట ఇచ్చినట్లు ఇస్మాయిల్ వర్గీయుల్లో నుంచి వార్తలు వినిపిస్తున్నాయి. మరోవైపు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నితిన్ రెడ్డిలు కూడా ఇస్మాయిల్ వైపే ముగ్గు చూపుతున్నట్లు ఎస్ఎండి వెంట ఉన్న కార్యకర్తలు బహిరంగ వ్యాఖ్యానాలు చేస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్న కాలంలో కూడా ఎలాంటి పదవులను ఆశించకుండా పార్టీ అభివృద్ధికి కోసం పనిచేసిన ఇస్మాయిల్‌కు ఈసారి ఖచ్చితంగా న్యాయం జరుగుతుందన్న ఆయన వర్గీయులు విశ్వసిస్తున్నారు.



వైసిపి మాజీ సమన్వయ కర్త ఇస్మాయిల్



వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో ఇస్మాయిల్ (ఫైల్)




వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఇస్మాయిల్ (ఫైల్)

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా

సెల్‌టవర్ ఎక్కిన యువకులు

ప్రజాశక్తి - లేపాక్షి, కదిరి టౌన్

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడి అరెస్టుకు నిరసనగా శ్రీసత్యసాయి జిల్లాలోని లేపాక్షి, కదిరి మండలాల్లో టిడిపి అభిమానులు సెల్‌టవర్ ఎక్కారు. లేపాక్షి పరిధిలోని మైదుగోళం గ్రామానికి చెందిన యువకుడు ఆదివారం సెల్ టవర్ ఎక్కాడు. గ్రామానికి చెందిన రామిరెడ్డి కొడుకు మంజునాథ్ రెడ్డి గ్రామం లోని సెల్ టవర్ ఎక్కి చంద్రబాబుని వెంటనే విడుదల చేయాలని, లేకపోతే ఇక్కడ నుండి దూకి ఆత్మహత్య చేసుకొంటానని హెచ్చరించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడం తో ఎస్ఐ మునీర్ అహమ్మద్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈసందర్భంగా మంజునాథ్ రెడ్డికి సర్ది చెప్పి టవర్ నుండి క్రిందికి దిగేలా చేశాడు. అనంతరం మంజునాథరెడ్డిని అతని కుటుంబ సభ్యులకు అప్పగించాడు. అదే విధంగా కదిరి పట్టణంలో సత్య సాయి జిల్లా తనకల్లు మండలానికి చెందిన శివయ్య అనే టిడిపి కార్యకర్త కదిరి పట్టణంలోని వలి సబ్ రోడ్డులో సెల్ టవర్ ఎక్కాడు. చంద్రబాబు నాయుడు పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని లేని పక్షంలో ప్రాణ త్యాగానికైనా సిద్ధమని హెచ్చరించారు. దీంతో పోలీసులు శివయ్యకు నచ్చజెప్పి కిందికి దింపారు.



కదిరిలో సెల్‌టవర్ ఎక్కిన టిడిపి అభిమాని శివయ్య

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

డిఆర్‌డిఎ పీడీ నరసయ్య



ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మహిళల ఆర్థిక స్వాలంబనతో పేదరికం నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జిల్లా గ్రామీణ శాఖ అభివృద్ధి సంస్థ, ఐకెపి ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య పేర్కొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలోని 32 మండలాల్లో మహిళలను పేదరికం నుంచి బయట పడేయటానికి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ద్వారా అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాల ద్వారా వారి జీవనోపాదులు కల్పించి అమలు చేయడం డిఆర్‌డిఎ, ఐకెపి పాత్ర కీలకమన్నారు. మహిళా సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పించి తద్వారా చేతివృత్తులు చిరు వ్యాపారాలు ద్వారా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ఆ ప్రాజెక్టు పని చేస్తోందన్నారు. అంతేగాక ఈ సంస్థ ద్వారా మరిన్ని పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. మహిళలనే కాక రైతు సంఘాల ద్వారా మెరుగైన జీవన విధానం అవలంబించి అభివద్ధి పరచుటకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో డిఆర్‌డిఎ, ఐకెపి ద్వారా అమలు పరుస్తున్న పథకాల గురించి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో ఆ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య వివరించారు.

ప్రశ్న : జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ ముఖ్య ఉద్దేశం ఏమిటి?లి

జవాబు : గ్రామీణ పేదలను సమీకరించి వారితో సంఘాలు ఏర్పాటు చేసి వారి జీవనోపాదులను మెరుగు పరచడం ద్వారా పేదరికం నిర్మూలన చేసేందుకు గాను పేదరిక నిర్మూలన సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తద్వారా మహిళలు ఆర్థిక స్వాలంబన కోసం కృషి చేస్తున్నాం.

ప్ర : జిల్లాలో ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయి? ఇప్పటివరకు మంజూరు చేసిన నిధుల వివరాలు ?

జ : పేదరికం నిర్మూలనలో భాగంగా జిల్లాలో 32 మండలాల్లో 3.53 లక్షల మంది మహిళలు సంఘాలలో సభ్యులుగా ఉన్నారు. 33,686 సంఘాలకు గాను గ్రామస్థాయిలో 1531 గ్రామ సమాఖ్యలు ఉన్నాయి. 32 మండలాలలోని మహిళా సంఘాల సభ్యులకు శ్రీ సత్య సాయి జిల్లా సమాఖ్యగా మాక్స్ చట్టం 1995 ప్రకారం ఏర్పాటు చేశాం. పేద మహిళ కుటుంబాలు పేదరికం నుండి బయటపడటానికి సమగ్రమైన వ్యూహం తయారుచేసి అమలు చేస్తున్నాం. ఇందులో భాగంగా జీవనోపాదుల పెంపుదల, మానవ అభివృద్ధి మెరుగుపరుచుకొనుట, సామాజిక భద్రతను కల్పించుట ద్వారా, వివిధ మార్గాల ద్వారా పేద మహిళా కుటుంబాలకు నెలకు రూ. 10 వేలు మించి ఆదాయాన్ని పెంచడమే ముఖ్య ఉద్దేశంగా ప్రాజెక్టు పని చేస్తోంది.

ప్ర : జిల్లావ్యాప్తంగా పెన్షన్లు ఎంతమందికి అందచేస్తున్నారు?

జ : క్రమం తప్పకుండా ప్రతి నెల ఒకటవ తేదీనే వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం పెన్షన్లు అందజేస్తోంది. రూ. 3వేలు పింఛను అందించాలన్న లక్ష్యంతో దశలవారీగా ప్రభుత్వం పెంచుతోంది. ప్రస్తుతం 2750 రూపాయలు అందిస్తున్నాం. వచ్చే ఏడాది మరో 250 రూపాయలను ప్రభుత్వం పెంచబోతోంది. కరోనా కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం ఏటా రూ.19వేల కోట్లు వివిధ రకాల పింఛన్లకు వ్యయం చేస్తోంది. 2022-23 వరకు 2.64 లక్షల మందికి రూ. 876.43 కోట్లు మంజూరు చేసింది.

ప్ర : ప్రాజెక్టు పరిధిలో అమలు చేస్తున్న పథకాల వివరాలు తెలపండి ?

జ : వైఎస్ఆర్ ఆసరా క్రింద జిల్లా వ్యాప్తంగా మొదటి విడత 23,288 సంఘాలకు గాను రూ. 179.69 కోట్లు, రెండవ విడత 23,365 సంఘాలకు రూ. 181.47 కోట్లు, మూడవ విడతలో 23,340 సంఘాలకు రూ. 180.20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే సున్నా వడ్డీ పథకం క్రింద మూడు విడతల్లో 84,919 సంఘాలకు రూ. 258.81 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. బ్యాంకు లింకేజీ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 23,388 సంఘాలకు రూ. 1068.06 కోట్లు రుణాలు ఇప్పించాం. శ్రీనిధి ద్వారా ఇప్పటివరకు 20,072 సంఘాలకు రూ. 100.35 కోట్ల రుణాలు అందించడం జరిగింది. ఉన్నతి పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 1267 సంఘాలకు రూ. 6.47 కోట్ల రుణం అందించాం. వైయస్సార్ చేయూత పథకం ద్వారా మూడు విడతల్లో రూ. 582.70 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. చేయూత మహిళ మార్టుల ప్రారంభంలో భాగంగా జిల్లాలో బత్తలపల్లి మండలంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో మహిళా మార్టు ప్రారంభించాం. ఇప్పటివరకు రూ. 54.99 లక్షలు అమ్మకాలు జరిపి రూ. 3 లక్షల ఆదాయంలో ఉంది. జిల్లాలో ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు నికర ఆదాయమే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. ఈ 942 సంఘాలలో 9316 మంది సభ్యులు ఉన్నారు. 9 మండలాలలో ఈ సంఘాలు ఉన్నాయి. వీటి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది.

ప్ర : ఈ సంఘాలకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

జ : ప్రభుత్వం ఏ ఉద్దేశంతో ఈ సంఘాలు ఏర్పాటు చేసిందో ఆ ఉద్దేశం నెరవేరే విధంగా సంఘం సభ్యులు కృషి చేయాలి. పేదరికం నుంచి బయటపడి ఆర్థిక స్వాలంబన సాధించే దిశగా ముందుకు సాగాలి. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి. బ్యాంకుల నుంచి తీసుకొన్న రుణాలను సకాలంలో చెల్లించితే బ్యాంకర్లు మరింత ఎక్కువ రుణాలు అందిస్తాయి.



డిఆర్‌డిఎ పీడీ నరసయ్య



అనంతపురంలో సామూహిక నిరసన దీక్షలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, నాయకులు



శింగనమలలో దీక్ష చేస్తున్న టిడిపి నాయకులు

కక్ష సాధింపుతోనే చంద్రబాబు అరెస్టు

జిల్లావ్యాప్తంగా టిడిపి ఆధ్వర్యంలో నిరసన దీక్షలు - కొనసాగిన అరెస్టులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడు చంద్రబాబును కేవలం కక్ష సాధింపు ధోరణితోనే అరెస్టు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆదివారం అనంతపురం అర్బన్ కార్యాలయంలో సామూహిక నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ సిఎం అయ్యాక అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేసి ప్రజా వ్యతిరేక విధానాల అవలంభిస్తున్నారన్నారు. సంక్షేమం పేరుతో, సంక్షోభం సృష్టిస్తూ ప్రతిపక్ష రాజకీయ పార్టీల ఉనికి లేకుండా చేయాలని చూస్తున్నారన్నారు. టిడిపి ఎక్కడ ధర్నాలు, నిరసనలు చేసినా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కక్ష సాధింపు ధోరణి వల్ల సాధించేదేమీ లేదని, పైశాచిక ఆనందం తప్ప ఏమీ ఉండదన్నారు. వీరి దీక్షలకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప మేయర్ సాకే గంపన్న, దేవళ్ల మురళి, మారుతీకుమార్‌గౌడ్, అజీజ్, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, బంగినాగ, రాజారావు, ముక్తియార్, సుధాకర్‌యాదవ్, బొమ్మినేని శివ, నారాయణస్వామి యాదవ్, సిమెంటు పోలన్న, పోతుల లక్ష్మీనరసింహులు, కుంచెపు వెంకటేష్, గోపాల్‌గౌడ్, చేపల హరి, మార్కెట్ మహేష్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, వెంకటేష్, వన్నూర్, తెలుగు మహిళలు స్వప్న, విజయ్ శ్రీరెడ్డి, బుల్లే శివబాల, సంఘ తేజస్విని, సరళ, జానకి, దలవాయి రమాదేవి, కృష్ణవేణి, వసుంధర, హసీనా, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జె.ఎల్.మురళీధర్ తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్యాంధ్రకు 9ఏళ్లు, విభజన ఆంధ్రప్రదేశ్‌కు ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు తన రాజకీయ చరిత్రలో అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారన్నారు. అలాంటి మచ్చలేని నాయకున్ని జైలుకు పంపాలని తప్పుడు కేసులు పెట్టిన సైకో జగన్‌రెడ్డి అని విమర్శించారు. ఇప్పటికైనా చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

శింగనమల : నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు టిడిపి సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి అమ్మలదిన్నె శాలిని, టిడిపి మాజీ మండల కన్వీనర్ చితంబరి దొర ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని ఆత్మా రామాలయం ముందు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుర్రం లక్ష్మీనారాయణ, పెరవలి పుచ్చకాయల రాము, అట్టే రామాంజనేయులు, చిన్న అక్బర్, ఆటో ఆంజనేయులు, బోయ సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, ముత్తు వలిబాషా, మునిస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్లూరు : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబుని అరెస్టు చేసి సిఎం జగన్ ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా టిడిపి నాయకులు బెదిరేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహణ కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, మండల కన్వీనర్ బాల రంగయ్య, మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, టిడిపి నాయకులు కులశేఖరరెడ్డి, రవికుమార్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, ఎల్‌కె చిన్నారెడ్డి, బ్రహ్మయ్య, రంగయ్య, వేణు, నారాయణస్వామి, శ్రీనివాసనాయుడు, విజయ్‌కుమార్‌నాయుడు, రవిచంద్రనాయుడు, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రవీంద్రచౌదరి, నాగేశ్వరరెడ్డి, జైడు, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు ఆదివారం పట్టణంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కూనీ అయిందన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు రిలే దీక్షల్లో పాల్గొన్నారు.

రాయదుర్గం : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆదివారం రాయదుర్గం టిడిపి కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన దీక్షలు చేపట్టారు. అలాగే దశభుజ గణపతి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు పూల నాగరాజు, టిడిపి రాయదుర్గం పట్టణ అధ్యక్షుడు నాగరాజు, డి.హీరేహాల్ మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు భారతి, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వెంకటేశులు, మహబూబ్‌బాషా, పార్టీ పట్టణ కార్యదర్శి ఇనాయత్‌బాషా, సన్నన్న, పోట్ల రవి, కృష్ణమూర్తి, బసవరాజు, శివప్రసాద్, వార్డు సభ్యులు భారతి, జ్యోతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతురాయచౌదరి విమర్శించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆదివారం స్థానిక ఉన్నం క్యాంపు కార్యాలయ ఆవరణలో టిడిపి నాయకులతో కలిసి రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలకోట్లు దండుకున్న నాయకులు, బాబాయిను చంపి గుండెపోటుగా చిత్రీకరించిన వారు రాష్ట్రంలో యథేచ్ఛగా తిరుగుతుండగా.. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల బాగోగుల కోసం పోరాడే నాయకులను జైళ్లలో పెట్టడం బాధాకరమన్నారు. ఈ ఘటన సిఎం జగన్ శాడిజం చూపుతోందన్నారు. అరాచక శక్తులు ఎన్ని కుట్రలు పన్నినా చివరకు ధర్మమే గెలుస్తుందన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, రామ్మోహన్‌చౌదరి, మారుతీచౌదరి, వైపీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో దీక్ష చేస్తున్న టిడిపి నాయకులు



పుట్లూరులో నిరసన దీక్ష చేస్తున్న టిడిపి నాయకులు



కళ్యాణదుర్గంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతురాయచౌదరి

నేరాలు ఘోరాలు

కార్లు ఢీ.. తప్పిన పెనుప్రమాదం

గుత్తి : పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం ముందు వెళ్తున్న కారును మరో కారు ఢీకొంది. హైదరాబాదు నుంచి అనంతపురం వెళ్తున్న కారును.. కర్ణాటకలోని రాయచూరు నుంచి బెంగళూరుకు వెళ్తున్న మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కార్లలో ప్రయాణిస్తున్న ఆరుగురు సురక్షితంగా బయటపడ్డారు. అయితే కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ట్రాఫిక్ స్తంభించకుండా దెబ్బతిన్న కార్లను అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : పట్టణంలోని చెరువు కట్ట వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గుంతకల్లు నుంచి గుత్తికి వస్తున్న ఆటోకు కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మండలంలోని తురకపల్లి గ్రామానికి చెందిన నరేష్‌బాబుతో పాటు ఆటో డ్రైవర్లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పేకాటజూదరుల అరెస్టు

యాడికి : స్థానిక ఆసుపత్రి సమీపంలోని ఓ పాడుబడిన ఇంటి బయట పేకాట ఆడుతున్న నలుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.12,360 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులురెడ్డి, చాంద్‌బాషా, భూపతిరాజు, శివ పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం స్వాధీనం

బెలుగుప్ప : అక్రమంగా తరలిస్తున్న 30 కింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యంతోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని శీరంగాపురం సమీపంలో ఆదివారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా కలేకుర్తి నుంచి వాహనంలో 30 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యం కళ్యాణదుర్గానికి తరలిస్తుండగా శీరంగపురం క్రాస్ సమీపంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బియ్యంతోపాటు వాహనం, ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలిస్తామన్నారు.



పోలీసులకు పట్టుబడిన వాహనం

ఘనంగా ఆంజనేయ స్వామి రథోత్సవం

బొమ్మనహాల్ : శ్రావణమాసం చివరి రోజును పురస్కరించుకుని ఆదివారం మండలంలోని నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారి మూలవిరాట్‌ను 40 అడుగుల రథంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాజాభజంత్రీల నడుమ, వేళతాళాల మధ్య శ్రీరామ నామం జపిస్తూ రథాన్ని లాగారు. కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి నరసింహారెడ్డి, సర్పంచి పరమేశ్వర, ఆలయ మాజీ ధర్మకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పూజలందుకున్న ఆంజనేయస్వామి

సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రమణ్యస్వామి బంగారు కవచంతో ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి తోపుదుర్తి నయనతారెడ్డి

ఆత్మకూరు : శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని సుబ్రమణ్యస్వామికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎస్‌వి వెటర్నరీ యూనివర్సిటీ బోర్డు సభ్యురాలు నయనతారెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుతున్నట్లు నయనతారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా పసుపుతో హరిద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి బంగారు కవచాన్ని తలపై మోస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తర్వాత అశ్లేష బలి శాంతి హోమం చేశారు.

వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

బెలుగుప్ప : జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున మండల పరిధిలో ఎవరైనా వినాయక ప్రతిమలను ఏర్పాటు చేయాలనుకునే వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ రామకృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయకుని ప్రతిమను ఏర్పాటు చేసే వారు ముందుగా వారి చిరునామా, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం చిరునామాలను తెలియజేసి ముందుగా పోలీసుల నుంచి అనుమతి పత్రాన్ని తీసుకోవాలన్నారు. అలాగే ప్రతిమను ప్రతిష్టించడానికి ముందు ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసుకుని, ప్రెసిడెంట్, సెక్రటరీతోపాటు సభ్యులను నియమించుకుని పూజలు చేసుకోవాలన్నారు. ప్రతిమను ఎన్ని రోజులు ఉంచుతారు.. అన్ని రోజుల్లో మండపం దగ్గర చేసుకునే ఏర్పాట్లను వివరించాలన్నారు. అలాగే దీపాలు వెలుగుతున్న సమయంలో మండపానికి అలంకరించిన వస్తువులు, దుస్తులను దూరంగా ఉంచుకోవాలని సూచించారు. వినాయక ప్రతిమలను ఊరేగించేటప్పుడు ఏ విధమైన డీజే సౌండ్ వంటి పరికరాలకు అనుమతించవన్నారు. కావున వినాయక ప్రతిమలను ఏర్పాటు చేయాలనుకునేవారు తప్పనిసరిగా పోలీసు నిబంధనలను పాటించాలని సూచించారు.

ప్రతిభావిద్యార్థులకు బహుమతులు

అనంతపురం : ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఐఎంఎ హాల్లో నిర్వహించిన సెమినార్‌లో ప్రతిభ కనబరిచిన డాక్టర్ కేఎస్ఆర్ గఫూర్ ఇన్సిటుట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు లభించాయి. ఇందులో భాగంగా ఆత్మహత్యల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై విద్యార్థులు చక్కటి ప్రజెంటేషన్ ఇచ్చారు. దీంతో శశికళ, సాయికిరణ్, అఖిలాండేశ్వరులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్

విద్యతోనే అత్యున్నత శిఖరాలు

అటహాసంగా నాయీబ్రాహ్మణ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యతోనే అత్యున్నత శిఖరాలు అధిరోహించవచ్చని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక జయమానెమ్మ కళ్యాణ మండపంలో నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరంగయ్య అధ్యక్షతన నిర్వహించిన నాయీబ్రాహ్మణ విద్యార్థుల ప్రతిభ పురస్కార కార్యక్రమం అట్టహాసంగా సాగింది. గౌరవాధ్యక్షులు ఎం.సుబ్రమణ్యం ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గుంటూరు పివి.రమణయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎంబి ఉమామహేశ్వరి, రాష్ట్ర కోశాధికారి బాలతాత మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ, అకుంఠిత దీక్ష ఉంటే సాధించలేనిది ఏదీలేదన్నారు. నాయీ బ్రాహ్మణ విద్యార్థులు ఎవరికీ ఏమాత్రం తీసిపోరన్నారు. నైపుణ్యత, సమర్థత, కమ్యూనికేషన్ స్కిల్స్ మనరక్తంలోనే ఉన్నాయన్నారు. ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా సమాజంలో కుల గౌరవ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయవచ్చన్నారు. ముఖ్యంగా దేశసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో మరింత స్ఫూర్తి, ప్రేరణ కలిగించాలన్న సంకల్పంతో ఇలాంటి కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా 2022-23లో టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన 42 మందికి, ఇంటర్‌లో 8 మంది విద్యార్థులకు రూ.వేయి చొప్పున నగదు, మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు. కాగా విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు కర్నూలు సీఐ ఉపేంద్ర రూ.2లక్షల చెక్కును సంఘం నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా జిల్లా రెవెన్యూ అధికారి పాకాల కొండయ్య, అనంతపురం జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్ ఎస్ కుమరేశ్వరన్, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అండ్ అకౌంట్ విజయవాడ సురేంద్రబాబు, ఆర్‌డిటి ఛైర్మన్ తిప్పేస్వామి, చిన్నపిల్లల వైద్య నిపుణులు, విశ్రాంత మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కేశవులు, డిప్యూటీ డైరెక్టర్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ విజయవాడ రామనాథరావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు దేవప్రసాదరావు, కర్నూలు సిఐ మారూరు ఉపేంద్రబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వివేకానంద స్వామి, పిటిసి సిఐ ఆర్.కృష్ణమోహన్, శింగనమల ఎంఇఒ నరసింహరాజు, శ్రీనిధి ఎజిఎం హనుమేష్‌బాబు, 50వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్‌బాబు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు, ఆత్మీయ నిర్వాహక బృందం జిల్లా సంఘం గౌరవ సలహాదారులు శివప్రసాద్, కె.మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు పొందిన విద్యార్థులతో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంటాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష, కేజీబీవీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం ఆదివారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన దీక్షకు యుటిఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వేతనాలు పెంచి 15 నెలలు గడుస్తున్నా పెంచిన వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. వెంటనే సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి, విద్యాశాఖలో పని చేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వి.రమణయ్య, సత్యసాయి జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

నకిలీ విత్తనాలతో పంట నష్టం

రొద్దం : మండల పరిధిలోని గౌరాజుపల్లి గ్రామానికి చెందిన రైతు సుబ్బారాయప్ప మూడు నెలల క్రితం రొద్దం లోని ఓ దుకాణంలో సిపి-333 రకం మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేశాడు. దాదాపు 17 ప్యాకెట్లు ప్యాకెట్ రూ. 1400 చొప్పున కొనుగోలు చేసి తనకున్న 4 ఎకరాల పొలంలో పంట సాగు చేశాడు. అయితే విత్తనం వేసిన తరవాత సుడి రోగంతో పంట మధ్య దశలోనే ఎండుముఖం పట్టింది. మరో రైతు పొలంలో పంట ఏపుగా పెరగడంతో పాటు చేతికందే దశలో ఉంది. దీంతో సదరు రైతు తాను పూర్తిగా పంట నష్టపోయినట్లు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

నేడు అనంతలో 'శ్రీరామిరెడ్డి' కార్మికుల ధర్నా

గుడిబండ : శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్, సిఐటియు అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యల పై సోమవారం(నేడు) ఉదయం 10 గంటలకు అనంతపురం నగరంలోని కలెక్టరేట్ ముందు ధర్నా చేపడుతున్నట్లు యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.ఓబులు తెలిపారు. ధర్నా అనంతరం కార్మికుల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామని మడకశిర, హిందూపురం డివిజన్ పరిధిలోని శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

'అభివృద్ధి' పేరుతో ఇసుక అక్రమ రవాణా

హిందూపురం : అభివృద్ధి పనుల పేరుతో కొందరు వ్యక్తులు పట్టణ సమీపంలో ఉన్న పెన్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పురపాలక సంఘంలో జరిగే అభివృద్ధి పనులకు ఇసుక అవసరం ఉంటే పక్కన ఉన్న రీచ్‌ల నుంచి క్యూబిక్ మీటర్ రూ. 600 చొప్పున గుత్తేదారులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అందుకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుంది. అది సైతం మున్సిపల్ కమిషనర్ లేఖను అనుసరించి ఇసుక రీచ్ నుంచి తీసుకు రావాల్సి ఉంటుంది. అయితే ఇదేమీ పట్టని గుత్తేదారులు కమిషనర్ లేఖ ఇచ్చిన వెంటనే ఏకంగా పెన్నా నదిలో జెసిబి 6 ట్రాక్టర్లు ఏర్పాటు ఆర్‌టిసి కాలనీ, ఇతర ప్రాంతాలకు తరలించారు. అయితే మున్సిపల్ కమిషనర్ ఈ నెల 7వ తేదీ ఇసుక కోసం లేఖ ఇచ్చారు. ఆ లేఖను అందరికీ చూపిస్తూ నాలుగు రోజుల నుంచి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఆదివారం సైతం ఆర్‌టిసి కాలనీలోని సెబ్ స్టేషన్ పక్కనే డంప్ చేస్తున్నా అధికారులెవరూ స్పందించక పోవడం విమర్శలకు తావిస్తోంది. దీంతో పాటు ఇసుక రవాణాకు మున్సిపల్ కమిషనర్ అనుమతి లేఖ ఇవ్వడం గమనార్హం.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు క్షేమంగా ఉన్నారన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇదే విషయాన్ని చెబుతున్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ పథకాలు నేరుగా ఇళ్లవద్దకు చేర్చిన దాఖలాలు లేవన్నారు. తరచూ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇళ్లకు తిరుగుతూ ప్రజలు యోగక్షేమాలు అడుగుతున్నారు. రాజకీయ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే పచ్చ కండువా కప్పుకోవాలన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు ఒప్పుకుంటేనే పథకాలు వచ్చేవన్నారు. మండల స్థాయి అధికారులు చెప్పినా ఉపయోగం ఉండేది కాదన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని ప్రజలే చెబుతున్నారన్నారు. వలంటీర్లకు వివరాలు అందజేస్తే వారే పథకాలు వచ్చేలా చూస్తున్నారన్నారు. ఇంతకంటే మాకు ఏం కావాలని గ్రామాల్లో మహిళలు చెబుతున్నారు. అనంతరం మండ్ల సుబ్బారెడ్డి కాలనీలో నూతనంగా సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అలాగే నందమూరి నగర్‌లో గ్రామ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. నందమూరి నగర్‌లో సుంకులమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.లక్ష విరాళంగా అందజేశారు. అలాగే మసీదు మరమ్మత్తు కోసం అవసరమైన సామగ్రిని విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మండల కన్వీనర్లు, ఎంపిపిలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి